సాక్షి
నల్లగొండ

సోమవారం, 18, సెప్టెంబర్, 2023



పోటెత్తిన భక్తులు

యాదాద్రి శ్రీలక్ష్మీనృసింహుడి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. 25వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. - 8లో



ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు

భువనగిరిలోని న్యూ డైమెన్షన్ స్కూల్‌లో రోలర్ స్పీడ్ స్కేటింగ్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా కొనసాగాయి. - 8లో



హరిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

సూర్యాపేటను హరిత జిల్లాగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

అందరికీ ఏకదంతుడి దీవెనలు అందాలి

- ప్రజలకు మంత్రి జగదీశ్‌రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు



నల్లగొండ టూటౌన్ : ప్రజలంతా సుఖశాంతులతో జీవించేలా.. ఆ ఏకదంతుని దీవెనలు అందాలని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ప్రార్థించారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలకు మంత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సకల శాస్త్రాలకు అధిపతిగా, బుద్ధికి–జ్ఞానానికి ఆరాధ్యుడిగా, ఆటంకాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో ఆరాదించాలని పేర్కొన్నారు. ఈ గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో సౌభ్రాతృత్వం, సోదరభావం వెల్లివిరిసేలా ఆనందంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎవరెన్ని ఆటంకాలు సృష్టించినా వాటిని వినాయకుని దీవెనలతో అధిగవిస్తూ సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు.

శాసనమండలి చైర్మన్ శుభాకాంక్షలు..

జిల్లా ప్రజలందరికీ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఆనందోత్సవాల మధ్య ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలు

నల్లగొండ : సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల రిలే దీక్షలు ఆదివారం 14వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరందాసు సంతోష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, కానీ ఆ హామీలు నెరవేర్చలేదని అన్నారు. సమగ్ర శిక్షాలో కాంట్రాక్టు పద్ధతిలో వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్న తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని అప్పటి వరకు తక్షణమే మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇటికాల రమేష్, సుంకోజు భిక్షం, ధనలక్ష్మి, పగిడిపాటి ప్రవీణ్, వెంకటక్రిష్ణా, రమేష్, గంగరాజు, వి.వెంకన్న, ఆర్.రామదాసు, సతీష్, పల్లా నాగరాజు, బొమ్ము మల్లేశం పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పరిసరాలను ఊడ్చుతున్న డీఆర్‌డీఓ కాళిందిని

కట్టంగూర్ : పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని డీఆర్‌డీఓ కాళిందిని పేర్కొన్నారు. కట్టంగూర్‌లో ఆదివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం, సంతలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పరిసరాలను ఊడ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు, ఎంపీడీఓ పోరెల్ల సునీత, ఎంపీఓ మహ్మద్ ఆర్థర్‌పర్వేజ్, సూపరింటెండెంట్ చింతమల్ల చలపతి, ఏఎంసీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, సర్పంచ్ చెన్నగోని సతీష్, ఎంపీటీసీ హరిక్రిష్ణ, న్యాయవాది శేరి చత్రపతి పాల్గొన్నారు.

కిశోర్‌కుమార్‌కు మదర్‌థెరిస్సా అవార్డు



అవార్డు అందుకుంటున్న కిశోర్‌కుమార్

నల్లగొండ టౌన్ : పోలీస్ శాఖలో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న నల్లగొండకు చెందిన పల్లె కిశోర్‌కుమార్ జీసీఎస్ వెల్లూరి ఫౌండేషన్ మదర్‌థెరిస్సా గోల్డెన్ గ్లోబ్ –2023 అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ వేణుగోపాలచారి కిశోర్‌కుమార్, ఝాన్సీ దంపతులకు అవార్డును అందజేసి శాలువాతో సత్కరించారు. సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకు గాను అవార్డుకు ఎంపిక చేశారు. కిశోర్‌కుమార్ ప్రస్తుతం సూర్యాపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏఎస్‌ఐగా విధులను నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను పోలీస్ సిబ్బంది, బంధుమిత్రులు అభినందించారు.

సాయుధ పోరాట స్ఫూర్తితో..

తెలంగాణ అభివృద్ధి



మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

- ఆనాటి పోరాటంలో నల్లగొండ జిల్లాది కీలకపాత్ర
- అనతికాలంలోనే స్వరాష్ట్రంలో అద్భుత ప్రగతి
- సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు



సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సుఖేందర్‌రెడ్డి



జెండాకు సెల్యూట్ చేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్, కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎస్పీ తదితరులు

నల్లగొండ : 'తెలంగాణ ప్రాంతం భారత్ యూనియన్‌లో విలీనమై నేటికి 75 ఏళ్లు పూర్తయ్యాయి. తెలంగాణకు స్వాతంత్ర్యం సాధించేందుకు ఈ గడ్డ మీద ఎందరో అసమాన త్యాగాలు చేశారు. వారి త్యాగాల స్ఫూర్తి నేటి తెలంగాణ అభివృద్ధికి నాంది పలికింది' అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా ఆదివారం నల్లగొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలో భూస్వాములు, జమీందార్లు, జాగీర్‌దార్లు, దేశ్‌ముఖ్ వేధింపులను తట్టుకోలేని ప్రజలు తిరగబడి సాయుధ రైతాంగ పోరాటం సాగించారని చెప్పారు. ఆనాడు తెలంగాణ ప్రజలను చైతన్యవంతులను చేయడానికి జరిగిన ప్రయత్నాల్లో గ్రంథాలయ ఉద్యమం మొదటిదని గుర్తు చేశారు.

ప్రజలను ఒకే తాటిపైకి తెచ్చిన కేసీఆర్..

హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో కలిసినప్పటికీ ఆనాటి కొందరి నాయకులు భాషాప్రయుక్త రాష్ట్రాల పేరుతో 1956లో ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పాటు చేశారని తెలిపారు. ఆంధ్రా పాలకుల అన్యాయాలకు వ్యతిరేకంగా తెలంగాణలో 1969లో ప్రారంభమైన తొలిదశ ఉద్యమంలో సుమారు 350 మంది అసువులుబాశారని గుర్తు చేశారు. మలిదశ ఉద్యమాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సుమారు 14 సంవత్సరాల పాటు గాంధేయ మార్గంలో నడిపించి ప్రజలందరినీ ఒకే తాటిపైకి తీసుకొచ్చారని తెలిపారు. 2014 జూన్ 2న ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం అనతికాలంలోనే అద్భుత ప్రగతిని సాధించిందని తెలిపారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

తెలంగాణ వ్యవసాయ రంగంలో అగ్రగామిగా నిలిచిందని.. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని చెప్పారు. సంక్షేమ పథకాలైన రైతు బంధు, రైతు బీమా, పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, బీసీబంధు, మైనారిటీలకు ఆర్థిక సాయం వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. 940 గురుకులాలు, ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ కే దక్కిందన్నారు. గతంలోనే హైదరాబాద్‌కే పరిమితమైన ఐటీ రంగం జిల్లా కేంద్రాలకు కూడా విస్తరించిందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందజేస్తూ.. జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లా మంత్రి, పార్లమెంటు సభ్యులు, జెడ్పీ చైర్మన్, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, కలెక్టర్, వివిధ శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్, శాసన సభ్యులు కంచర్ల భూపాల్‌రెడ్డి, రవీంద్రకుమార్, నోముల భగత్, ఎన్.భాస్కర్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఎం.సైదిరెడ్డి, ఎస్పీ అపూర్వరావు, అదనపు కలెక్టర్‌లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నల్లగొండ జిల్లాకు ప్రత్యేక స్థానం..

ఆనాటి పోరాటంలో నల్లగొండ జిల్లా కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఈ జిల్లా నుంచి భీంరెడ్డి నర్సింహారెడ్డి బొమ్మగాని ధర్మభిక్షం, ఆరుట్ల రామచంద్రారెడ్డి, బద్దం ఎల్లారెడి, జిట్టా రామచంద్రారెడ్డి, కట్కూరి రామచంద్రారెడ్డి, సుశీలాదేవి, సుద్దాల హనుమంతు వంటి ఎందరో త్యాగధనులు తెలంగాణలో సాయుధ పోరాటంలో పాల్గొన్నారని చెప్పారు. బండి యాదగిరి రాసిన 'బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి' పాట సాయుధ పోరాటాన్ని ఉధృతం చేసిందని పేర్కొన్నారు. ప్రపంచ పోరాటాల చరిత్రలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం రంగంలోకి దిగడం, మరోవైపు సాయుధ పోరాటం సాగుతుండడంతో 1948 సెప్టెంబరు 17న అప్పటి నిజాం భారత యూనియన్‌లో విలీనానికి చేరడానికి అంగీకరించారని చెప్పారు.

కళ్లకుగంతలతో అంగన్‌వాడీల నిరసన



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నల్లగొండ టౌన్ : తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ ఉద్యోగులు ఆదివారం స్థానిక సీడీపీఓ కార్యాలయం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు తమ సమస్యలను పరిస్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేసిన ప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలన్నారు. కార్యక్రమంలో పోలె సత్యనారాయణ, కె.విజయలక్ష్మి, సాదూరి లక్ష్మి, ప్రకృతాంబ, మణిరూప, కళ్యాణి, రేణుక, ప్రమీల, వాణి, నాగమణి, యాదమ్మ, సముద్రమ్మ, జ్యోతి, సరిత, సునీత తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులకు ముస్తాబు



నల్లగొండలో ముస్తాబైన మండపం



కొబ్బరికాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

- సిద్ధమైన వినాయక మండపాలు
- విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో సందడి

రామగిరి(నల్లగొండ) : వినాయక నవరాత్రులకు జిల్లా ముస్తాబైంది. ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేందుకు భక్తులు ఏర్పాటు చేశారు. నవరాత్రులపాటు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఆదివారం జిల్ల వ్యాప్తంగా విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోళ్ల సందడి కనిపించింది. పట్టణాల్లో ప్రధాన రోడ్లు కిటకిటలాడాయి. స్వచ్ఛంద సంస్థలు పలుచోట్ల మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశాయి.

అధిక సంఖ్యలో గణేష్ మండపాలు..

మునుపెన్నడూ లేని విధంగా ఈసారి ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు విగ్రహాలను పంపిణీ చేస్తుండడంతో పెద్ద సంఖ్యలో మండపాలు ఏర్పాటవుతున్నాయి. ప్రతి కాలనీ, వీధి, కూడలిలో విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు యువకులు సిద్ధమయ్యారు. మండలపాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. తీరొక్క డిజైన్‌లతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మండపాలు ఏర్పాటు చేసే వారు ముందుగా అనుమతి తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

పోలీసు శాఖకు సహకరించాలి



గణేష్ ఉత్సవాలు సజావుగా నిర్వహించుకునేందుకు నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించాలి. ఇప్పటికే వాట్సాప్ గ్రూప్ ద్వారా గణేష్ మండలపాల వివరాలు నమోదు చేస్తున్నాం. ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా మండపాలను రోడ్లపై పెట్టకూడదని సూచించాం. వీలైనంత వరకు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలి.

– నేతి రఘుపతి, గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు, నల్లగొండ

సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న పాలకులు

నల్లగొండ టౌన్ : భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాలకులు వక్రీకరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర నాయకుడు మల్లెపల్లి ఆదిరెడ్డి విమర్శించారు. తెలంగాణ సాయుధ పోరాట ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నల్లగొండలోని పార్టీ కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత సాయుధ పోరాటానిదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, పబ్బు వీరస్వామి, ఎల్.శ్రవణ్‌కుమార్, రమేష్, ముండ్ల ముత్యాలు, విశ్వనాథుల లెనిన్, ఎస్‌కె.మదార్, యూసూఫ్, పాండరి, గౌస్, జమీర్, వెంకట్‌రెడ్డి, విజయరెడ్డి, ఎం.పద్మ, పి.సుజాత, గిరి, వీరయ్య, శంకర్ పాల్గొన్నారు.



జెండాకు వందనం చేస్తున్న నాయకులు

బుద్ధవనం సందర్శన



మహాస్థూపం ముందు బౌద్ధులు

నాగార్జునసాగర్ : మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాకు చెందిన బౌద్ధులు ఆదివారం బుద్ధవనాన్ని సందర్శించారు. తపోవనం, జాతక కథల పార్కు, స్థూపపార్కు, శ్రీలంక దేశీయులు ఏర్పాటు చేసిన 40అడుగులు గల బుద్ధుడి విగ్రహం, అవకాన బుద్ధుడు తదితర ప్రాంతాలను సందర్శించారు. బుద్ధుడికి సంబంధించిన విశేషాలను మహాస్థూపంపై రాతితో చెక్కిన వాటిని ఒక్కొక్కటిగా చూస్తూ సాయంత్రం వరకు గడిపారు. వీరికి పర్యాటకశాఖ గైడ్ సత్యనారాయణ బుద్ధవనం గురించి వివరించారు.

కవిత్వంలో జీవితాన్ని ప్రతిబింబించవచ్చు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శివారెడ్డి, చిత్రంలో సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కవులు

రామగిరి(నల్లగొండ) : జీవితంలోని కష్టసుఖాలను కవిత్వంలో ప్రతిబింబించవచ్చని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కొండల నాగేశ్వరరావు రచించిన విశ్వగీతం గేయ దృశ్య కావ్యం ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాగేశ్వరరావు నాలుగు దశాబ్దాలుగా సాహితీ చేస్తున్న కవి అని కొనియాడారు. అనంతరం నాగేశ్వరరావుకు 2023 సంవత్సరానికి జీవన సాహిత్య పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ కృష్ణకౌండిన్య, డాక్టర్ బెల్లి యాదయ్య, మేరెడ్డి యాదగిరిరెడ్డి, పున్న అంజయ్య, పులిజాల నళినిరంజనరావు, డాక్టర్ పగడాల నాగేందర్, సైకిబాబా, బోధనం నర్సిరెడ్డి, అలుగుబెల్లి రాంచంద్రారెడ్డి, మునాసు వెంకట్, ధవాల విద్యాసాగర్‌రావు, బండారు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటానికి వారసులు.. కమ్యూనిస్టులే

- ఏఐకేఎస్ జాతీయ నాయకుడు మల్లారెడ్డి, జూలకంటి రంగారెడ్డి
- సీపీఎం ఆధ్వర్యంలో మిర్యాలగూడలో భారీ ర్యాలీ



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టులే నిజమైన వారసులని ఏఐకేఎస్ జాతీయ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాయుధ రైతాంగ పోరాట ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టులు ఎంతో మంది వీరోచిత పోరాటాలు చేశారని పేర్కొన్నారు. నాటి పోరాటంలో బీజేపీ లేదన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణకు రాలేదని, నిజాం నవాబు పాలనలో తెలంగాణ ప్రజలు అన్యాయానికి గురయ్యారని చెప్పారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన ఘనత కమ్యూనిస్టులకే దక్కుతుందన్నారు. నేడు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఓట్ల కోసం సాయుధ పోరాటాన్ని వాడుకుంటున్నాయని ధ్వజమెత్తారు. నిజాం ఆగడాలను అరికట్టేందుకు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలు ఉద్యమించారని ఈ పోరాటంలో సుమారు నాలుగు వేల మంది అసువులు బాశారని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని రాబోయే ఎన్నికల్లో వారిని ఓడించి బుద్ధి చెప్తారని తెలిపారు. అనంతరం సాయుధ పోరాట యోధులను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ సీడీ రవికుమార్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, రెమడాల పరుశురాములు, పోలెబోయిన వరలక్ష్మి, వినోద్ నాయక్, తిరుపతి రామ్మూర్తి, పాదూరి శశిధర్‌రెడ్డి, పాదూరి గోవర్ధని, రొండి శ్రీనివాస్, జటంగి సైదులు, ఊర్మిళ, చెనగాని యాదగిరి, పల్లా భిక్షం, పిల్లుట్ల సైదులు, వాడపల్లి రమేష్, మాధవరెడ్డి, దేశిరాం నాయక్, అరుణ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం కార్యకర్తలు

సమైక్యతా సంబురం


సూర్యాపేట : జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి


నల్లగొండ : జాతీయ జెండాకు వందనం చేస్తున్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ


భువనగిరి : జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న ప్రభుత్వ విప్ సునీత, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, భువనగిరి డీసీపీ తదితరులు


నల్లగొండ కలెక్టరేట్‌లో జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తదితరులు


భువనగిరిలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు


నల్లగొండలో..


సూర్యాపేటలో...

నారసింహుడి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో భక్తులు అధికంగా శ్రీస్వామి వారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, ప్రసాద విక్రయశాల, క్యూలైన్లు, నిత్య కల్యాణ మండపం, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, కల్యాణకట్ట, లక్ష్మీ పుష్కరిణి, దేవస్థానం బస్టాండ్‌లు భక్తులతో కిటకిటలాడాయి. ఇక శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి సుమారు మూడు గంటల సమయం, వీఐపీ దర్శనానికి సుమారు గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. వివిధ పూజలతో నిత్య ఆదాయం రూ.40,88, 558 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.


ముఖ మండపంలో క్యూకట్టిన భక్తులు

ఆరు దశాబ్దాల తర్వాత అ'పూర్వ' సమ్మేళనం

నార్కట్‌పల్లి : ఆరు దశాబ్దాల తర్వాత వారంతా ఒక్కచోట కలిశారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నల్లగొండలోని మర్టీపర్పస్ ఉన్నత పాఠశాలలో 1961–62లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం నార్కట్‌పల్లిలో కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు.కార్యక్రమంలో డోకూరి శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రామ్మూర్తి, నర్సింహ, మోహన్‌రెడ్డి, యాదగిరి, కృష్ణమూర్తి, నరహరి, అబ్దుల్ కరీం, అబ్రహం తదితరులు ఉన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

'పేట'ను హరిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

- మహిళలంతా ఆరోగ్యవంతులుగా ఉండాలనేదే నా ఆకాంక్ష
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సూర్యాపేటను హరిత జిల్లాగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో బెంగళూరుకు చెందిన పర్యావరణవేత్త డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో ఋతుప్రేమపై మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలంతా ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో ఋతుప్రేమ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. స్వచ్ఛ సూర్యాపేట కోసం చేపట్టిన పవిత్రమైన యజ్ఞానంలో అందరూ భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలుపరుస్తూ అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం ఆసరాగా ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అమలుపరుస్తున్న పథకాలను ప్రపంచ దేశాలు అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో సీఎం కేసీఆర్ పల్లె దవఖానాలు, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఆరోగ్య మహిళా కేంద్రాలు ఏర్పరిచి మహిళల కోసం ప్రత్యేకంగా ప్రతి మంగళవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిరోధించడం అందరం ఆచరించాలని మంత్రి కోరారు. ప్రపంచమంతా సూర్యాపేటని చూసి నేర్చుకునే విధంగా చేస్తానన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సీహెచ్ ప్రియాంక, జెడ్పీ చైర్ పర్సన్ దీపికా యుగంధర్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ శ్రీనివాస్, పెన్‌పహాడ్ జెడ్పీటీసీ మామిడి అనిత ,చివ్వెంల ఎంపీపీ కుమారి, డిడబ్ల్యూఓ జ్యోతి పద్మ ,మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శారద, ప్రజా ప్రతినిధులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి


సదస్సుకు హాజరైన మహిళలు

ఖద్దరు మాటున మోసం!

- ఫైరవీలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్న ప్రజాప్రతినిధి
- చనిపోయిన వ్యక్తి పేరిట పంట రుణం కాజేసిన ఘనుడు
- ఓ రైతుకు రెండు బ్యాంకుల్లో పంట రుణం ఇప్పించి డబ్బులు దండుకున్న వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న బాధితులు

శాలిగౌరారం: ఖద్దరు మాటున ఓ ప్రజాప్రతినిధి అటు ప్రభుత్వ సంస్థలతోపాటు అమాయకులను మోసగిస్తూ డబ్బులు దండుకుంటున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శాలిగౌరారం మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన శివరాత్రి ఇద్దయ్యకు భార్య సావిత్రమ్మ, కుమార్తె ఉన్నారు. ఇద్దయ్యకు గ్రామంలో 1.21 గుంటలు వ్యవసాయ భూమి ఉంది. అనారోగ్యంతో ఇద్దయ్య 2013లో మృతిచెందాడు. ఇద్దయ్య మృతిచెందే వరకు ఆయన ఏ బ్యాంకులోనూ పంటరుణం తీసుకోలేదు. కానీ,ఇద్దయ్యకు శాలిగౌరారం ఎస్‌బీహెచ్(నేటి ఎస్‌బిఐ)లో క్రాప్‌లోన్ ఉందని, నీవు సంతకం చేస్తే అప్పు మొత్తం మాఫీ అవుతుందని ఇద్దయ్య భార్య సావిత్రమ్మకు ఆ ఫైరవీకారి, ప్రస్తుత ప్రజాప్రతినిధి నచ్చచెప్పి వ్యవసాయ భూమికి సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాన్ని తీసుకొని బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకు సిబ్బందిని తనకు అనుకూలంగా మార్చుకున్న ఆ ఫైరవీకారి చనిపోయిన ఇద్దయ్య పేరుమీద పంటరుణ మంజూరీ పత్రాలపై అతడి భార్యతో వేలిముద్రలు పెట్టించి అప్పు మాఫీ జరుగుతదని చెప్పి తిరిగి ఆమెను ఇంటికి పంపించాడు. ఆ తర్వాతా చనిపోయిన ఇద్దయ్య పేరున ఆ ఫైరవీకారి 2015న రూ.37000లు పంటరుణం పొందాడు. గత సంవత్సరం ఇద్దయ్య పేరున బ్యాంకులో పంటరుణం ఉందని, రుణం తీర్చాలని బ్యాంకు సిబ్బంది ఇద్దయ్య భార్య సావిత్రమ్మకు చెప్పడంతో ఆందోళనకు గురైంది. బ్యాంకువారిని అడుగగా వారు రూ. 53 వేలు అప్పు ఉందని చెప్పారు. దీంతో దిక్కుతోచని ఆమె వెంటనే ఆ ఫైరవీకారి ఇంటికి వెళ్లి అడుగగా నాకేం తెలియదని పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. బ్యాంకు అప్పు విషయంపై బాధిత మహిళ ఇటీవల బ్యాంకు మేనేజర్‌ను కలువగా ఈనెల 19న బ్యాంకుకు రమ్మని చెప్పి పంపించారు. ఇదిలా ఉండగా ప్రజాప్రతినిధి అయిన ఫైరవీకారి చేసిన మరెన్నో మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వాటిలో కొన్ని...

- గ్రామానికి చెందిన ఓ రైతుకు 2.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా ఆయన పెర్కకొండారంలోని ఏపీజీవీబీ నుంచి ఇరవై ఏళ్లుగా క్రమం తప్పకుండా పంటరుణం పొందుతున్నాడు. ఇతనికి శాలిగౌరారం ఎస్‌బీఐ బ్యాంకులో కూడా క్రాప్‌లోన్ ఇప్పిస్తానని చెప్పి 2020లో రూ.98వేలు పంటరుణం పొందాడు. ఆ రుణాన్ని ఆరైతుకు ఇవ్వకుండా అతనికి సంబంధించిన బ్యాంకు సేవింగ్ పాస్‌బుక్ తనదగ్గర ఉంచుకొని ఫైరవికారి ఆ డబ్బులు తీసుకున్నాడు.
- గ్రామానికి చెందిన మరో వ్యక్తికి ఎకరం భూమి ఉంటే దానిని రెండు ఎకరాలుగా జీరాక్స్‌లు తీసి శాలిగౌరారం ఎస్‌బీఐలో 2018–19లో రూ.80 వేలు రుణం ఇప్పించి బ్యాంకు సిబ్బందికి ఇవ్వాలని రూ.20 వేలు తీసుకున్నాడు.
- ఓ మహిళ తన అవసరాల కోసం బ్యాంకులో దాచుకున్న రూ. 1.25లక్షలలో రూ.లక్ష తీసుకుంటానని బ్యాంకులో విత్ డ్రా ఫాం నింపమని కోరితే 1.20లక్షలకు ఫారం రాసిచ్చాడు. అనంతరం రూ.20వేలు ఎక్కువ వచ్చాయని, బ్యాంకులో జమచేయాలని ఆ మహిళకు చెప్పి రూ.20 కాజేశాడు. కొద్ది రోజుల తర్వాత మోసం వెలుగుచూడడంతో బ్యాంకులో జమచేశానని బుకాయించడంతో బాధితురాలు లబోదిబోమంటోంది.
- గ్రామానికి చెందిన ఓ రైతుకు బ్యాంకులో రూ. 85 వేలు రుణం వస్తే రూ.60 వేలు మాత్రమే వచ్చాయని చెప్పి రూ.25 వేలు తనజేబులో వేసుకున్నాడు. తర్వాతా ఆరైతుకు బ్యాంకు అప్పు ఎంత ఉందో తెలిసేసరికి నివ్వెరపోయాడు. ఈ విషయంపై అడిగితే తనకు ఏమి తెలియదని చెప్పి పంపించాడంటూ వాపోయాడు. సదరు ఫైరవీకారి, ప్రస్తుత ప్రజాప్రతినిధి మోసాలపై బాధితులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

మోటార్లు చోరీ చేస్తున్న నలుగురి అరెస్ట్

యాదగిరిగుట్ట: వ్యవసాయ బావుల విద్యుత్ మోటార్లు, వైర్లు చోరీకి పాల్పడుతున్న నలుగురిని పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. యాదగిరిగుట్ట పట్టణం అంగడి బజారులో నివాసం ఉంటున్న నలుగురు వ్యక్తులు శనివారం అర్ధరాత్రి తరువాత యాదగిరిపల్లిలోని రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావుల వద్ద పెట్రోలింగ్ పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించారు. వ్యవసాయ బా వుల వద్ద పరిశీలించగా మోటార్లు, వైర్లు చోరీ చేసినట్లు ఆనవాళ్లు కనిపించాయి. దీంతో నలుగురు దొంగలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

నూతనకల్: గుర్తుతెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. ఈ ఘటన నూతన్‌కల్ మండలం రామలింగాపురం గ్రామ శివారులోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. రామలింగాపురం శివారులోని పురాతన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పూజా కార్యక్రమాలు నిర్వహించడం లేదు. గమనించిన దుండగులు గుప్త నిధుల కోసం ఆలయంలోని గర్భగుడిలో తవ్వకాలు జరిపారు. అక్కడ కుండపెంకులు కన్పించడంతో దుండగులకు నిధి దొరకవచ్చునని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు ఆదివారం గమనించడంతో తవ్వకాల విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

చందూరు : యువతి అదృశ్యమైంది. చందూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన యువతి శనివారం మధ్యాహ్నం బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ప్రయాణికురాలి వద్ద రూ.1.70లక్షలు చోరీ

చౌటుప్పల్ : ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలి వద్ద దుండగులు రూ.1.70లక్షలు చోరీ చేశారు.నల్లగొండ మండలం దోమలపల్లి గ్రామానికి చెందిన చెన్నరాజు భాగ్యయ్య ప్లాటు కొనుగోలుకు సంబంధించి డబ్బులు చెల్లించేందుకు స్వగ్రామం నుంచి శనివారం సాయంత్రం హైదరాబాద్‌కు వెళ్లింది. అనివార్య కారణాలతో చెల్లింపు ప్రక్రియ వాయిదా పడింది. దీంతో సదరు మహిళ అదే రోజు రాత్రి నగదుతో ఆర్టీసీ బస్సులో స్వగ్రామానికి బయలుదేరింది. ఆ క్రమంలో చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామం వద్దకు రాగానే తన వెంట ఉన్న బ్యాగును చూసుకుంది. దాంతో బ్యాగులోని నగదు కన్పించలేదు. లబోదిబోమంటూ బస్సులో వెతికినా ప్రయోజనం కలగలేదు. దీంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీటెక్ విద్యార్థికి గోల్డ్‌మెడల్

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని తుంగతుర్తి ఆవాస గ్రామం బండమీదిగూడేనికి చెందిన సూదిరెడ్డి దినేష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్‌ఐటీ) వరంగల్ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. రైతు కుటుంబానికి చెందిన దినేష్‌రెడ్డి తండ్రి శేఖర్‌రెడ్డి టీఎస్ఎస్పీ మొదటి బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తల్లి ధనలక్ష్మి గృహిణి. దినేష్‌రెడ్డి చిన్ననాటి నుంచి చదువులో చురుకుగా ఉండేవాడు. ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన దినేష్‌రెడ్డికి ఐఐటీలో సీటు వచ్చినప్పటికీ తల్లిదండ్రులకు దూరంగా ఉండటం ఇష్టం లేక వరంగల్ ఎన్‌ఐటీ కళాశాలలో బీటెక్ కమ్యూనికేషన్స్ విభాగంలో చేరాడు. బీటెక్‌లో 98శాతం మార్కులు సాధించిన దినేష్‌రెడ్డి గోల్డ్ మెడల్ సాధించాడు. శనివారం రాత్రి ఎన్‌ఐటీ ఆవరణలో అట్టహాసంగా నిర్వహించిన 21వ కాన్వకేషన్‌లో కళాశాల యాజమాన్యం దినేష్‌రెడ్డికి గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించింది. దినేష్‌రెడ్డి ప్రతిభను గుర్తించిన పలు ఐటీ కంపెనీల నుంచి భారీ వేతనంతో ఆఫర్లు వచ్చాయి. ఈ క్రమంలో ప్రముఖ ఐటీ కంపనీ సేల్స్‌ఫోర్స్ యాజమాన్యం రూ.48లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం ఇచ్చింది.

సివిల్స్ సాధించి ప్రజాసేవ చేయటమే లక్ష్యం

బీటెక్‌లో గోల్డ్ మెడల్ సాధించటంలో నా తల్లిదండ్రులతో పాటు ఎన్‌ఐటీ ప్రొఫెసర్లు, డీన్, సహచర విద్యార్థుల ప్రోత్సాహం ఎంతో ఉంది. ప్రజాసేవకు మించిన ఉద్యోగం మరోటి లేదు. రెండేళ్ల పాటే ఐటీ రంగంలో పని చేసి అనంతరం సివిల్స్‌పై దృష్టి పెడతా. సివిల్స్ సాధించి భవిష్యత్తులో ప్రజలకు సేవలు అందించటమే లక్ష్యం. చిన్ననాటి నుంచి తనను విద్యారంగంలో ప్రోత్సాహిస్తున్న తాత సూదిరెడ్డి నర్సిరెడ్డి, నానమ్మ లింగమ్మలకు తాను సాధించిన గోల్డ్ మెడల్‌ను అంకితమిస్తున్నా. – దినేష్‌రెడ్డి


గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రం అందుకుంటున్న దినేష్‌రెడ్డి

ఉత్సాహంగా స్పీడ్ స్కేటింగ్ పోటీలు

సాక్షి, యాదాద్రి : భువనగిరిలోని న్యూ డైమెన్షన్ పాఠశాలలో రోలర్ స్పీడ్ స్కేటింగ్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. సువాలి ఎస్టేట్ అధినేత, చైర్మన్ పులిమామిడి సుభాష్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ ఫస్ట్ ర్యాంకింగ్ రోలర్ స్పీడ్ స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు రెండోవ రోజు ఆదివారం కొనసాగాయి. తొలిసారిగా జరుగుతున్న ఈ స్కేటింగ్ పోటీల్లో 780 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన క్రీడా కారులు సెమీ ఫైనల్ వరకు చేరుకున్నారని ఆర్గనైజర్స్ తెలిపారు. కార్యక్రమంలో సువాలి ఎస్టేట్ చైర్మన్ పులిమామిడి సుభాష్ రెడ్డి, న్యూ డైమెన్షన్ పాఠశాల డైరెక్టర్ శివాణి రెడ్డి, ఇండియా స్కేటింగ్ ఫెడరేషన్ చీఫ్ భగీరథ, రాష్ట్ర అధ్యక్షుడు మదన్ మోహన్ రెడ్డి, ఆర్గనైజర్ కోచ్ రాజు, ప్రిన్సిపాల్ శ్వేతా రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.


రోలర్ స్పీడ్ స్కేటింగ్‌లో విద్యార్థుల విన్యాసాలు

కాంగ్రెస్ పార్టీలో చేరిన మందుల సామేల్

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేల్ ఆదివారం హైదరాబాద్‌లో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మందుల సామేల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు మంత్రి పదవిని త్యాగం చేసిన తెలంగాణ యోధుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో తెలంగాణ విమోచన దినోత్సవం రోజున తాను కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషం కలిగిస్తుందన్నారు. తుంగతుర్తి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి కృషి చేస్తానని అన్నారు. తనను పార్టీలోకి ఆహ్వానించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.


మందుల సామేల్‌ను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోమటిరెడ్డి